క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో పనులు పూర్తిచేయాలని కార్పొరేటర్ బి.జానారెడ్డి సూచించారు. స్థానిక దేవీనగర్ రెండో లైన్ నుంచి ఏడో లైన్ వరకు మురుగు పారుదల, కల్వర్టు పనులను బుధవారం ఏఈ నాగరాజుతో కలిసి ఆయన పరిశీలించారు. మురుగు పారుదల, కల్వర్టు పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మురుగు సమస్యలు రాకుండా పనులు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్ చొరవతో నీటి సరఫరా



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని సర్కిల్–2 ఏరియా 24వ డివిజన్ గిరిపురం, కస్తూరిబాయిపేట ప్రాంతాల్లో నీటి సరఫరా అర్థాంతరంగా నిలిపోయింది. దీనిపై స్పందించిన కార్పొరేటర్ కుక్కల అనిత అధికారులతో మాట్లాడి బుధవారం వాటర్ ట్యాంక్‌తో నీటి సరఫరా చేయించారు. నీటి సరఫరా అంతరాయానికి ఏర్పడిన సమస్యను సత్వరమే పరిష్కరించి సజావుగా ప్రజలందరికీ నీరు అందేలా చూడాలని వీఎంసీ అధికారులను ఆదేశించారు. వేసవి సందర్భంగా భవిష్యత్తులో నీటి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

పైపులైను పనుల పరిశీలన




పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్ నగర్ కరకట్ట వద్ద జరుగుతున్న పైపులైను పనులను బుధవారం 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు పరిశీలించారు. 63వ డివిజన్ వడ్డెర కాలనీ నుంచి రాజీవ్‌నగర్ కరకట్ట వైపు వచ్చే నీరు బోరునీళ్లు వస్తున్నాయని.. అవి కలుషితమై దుర్వాసన వస్తున్నట్లు స్థానికులు వాపోయారు. దీంతో వీఎంసీ అధికారులు ప్రత్యేక పైపులైను పనులు చేపట్టగా ఆమె దగ్గరుండి పరిశీలించారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



పాయకాపురం(విజయవాడరూరల్): శ్రీరాముడి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం 63వ డివిజన్ సుందరయ్య నగర్లో శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి పూజా క్రతువులు నిర్వహించి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు లబ్బా వైకుంఠం, ఆంజనేయులు, కిషోర్, షేక్ మెహర్, రాము, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై కొలువు దీరిన కోదండరాముడు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం(కొత్తగుళ్లు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామస్వామి వారు బుధవారం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం స్వామి వారికి దర్బార్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశేష అర్చనలు..

ఈ సందర్భంగా ఉత్సవంలో పాల్గొన్న అందరికీ స్వామి వారి ఆశీస్సులను అర్చకస్వాములు అందజేశారు. అనంతరం స్వామి వారికి ప్రీతికరమైన శేషవాహనంపై కొలువుదీరి భక్తులకు నేత్రానందాన్ని కలిగించారు. ఈ సందర్భంగా ఆలయంలో భజనమండలి వారిచే భజన కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలోని మూలవిరాట్‌లకు విశేష అర్చనలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు ఆంజనేయాచార్యులు తదితరులు నిర్వహించారు.

నత్తనడకన కల్వర్టు నిర్మాణం

- బుడమేరు వరద ముంపు నివారణకు నామమాత్రంగా పనులు
- కనిపించని శాశ్వత పరిష్కార చర్యలు



నూజివీడు రోడ్డులో కల్వర్టు నిర్మాణం

పాయకాపురం(విజయవాడరూరల్): బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నగరశివారు ప్రాంతాల ప్రజలు సర్వత్రా విమర్శిస్తున్నారు. గతేడాది ఆగస్టు నెలలో సంభవించిన భారీవర్షాలకు బుడమేరు వరద ఉధృతంగా ప్రవహించడంతో రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్, రాధానగర్, అంబాపురం, కండ్రిక పరిసర ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని స్థానికులు బ్రతుకు జీవుడా అంటూ ఇల్లు వదిలి సురక్షిత ప్రాంతలకు వెళ్లిన వారు దాదాపు 20 రోజులకు గానూ తిరిగి రాలేదు.

ఎనిమిది నెలలుగా సాగుతున్న పనులు..

బుడమేరు వరదల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ పడవల్లో ముంపు ప్రాంతాలను పరిశీలించడానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బుడమేరు వరద ముంపు నుంచి ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత పరిష్కారం చర్యలు చేపడతామని అప్పట్లో ప్రజలకు హామి ఇచ్చారు. బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన ప్రజానీకం ఇంతవరకు తేరుకోలేదు. దాదాపు ఎనిమిది నెలలవుతున్నా బుడమేరు వరద శాశ్వత నివారణ చర్యలు చేపట్టలేదు. బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు పూడ్చిన గండ్లు లీకై నీరు వస్తోంది. సైఫన్ల నుంచి కూడా నీరు చిన్న వాగు మాదిరి ప్రవహిస్తోంది. బుడమేరు వరదను జక్కంపూడి వద్ద గొల్లపూడి కాల్వలోకి మళ్లించడం ద్వారా నగరంలోని శివారు ప్రాంతాలైన రాజీవ్‌నగర్, కండ్రిక, పాయకాపురం, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలకు వరద నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టేందుకు అధికారులతో ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేయించింది.

గోడల దశలో పనులు..



సగం పనులతో కల్వర్టు గోడల నిర్మాణం

బుడమేరు వరదలు పట్టణంలోకి రాకుండా చేసే ఈ పనులకు దాదాపు రూ. 10 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి అంచనాలతో కూడిన నివేదికను నెల రోజుల క్రితం ఇచ్చినట్లు తెలిసింది. అంతటి ఖర్చును భరించలేక ప్రభుత్వం వాయిదా వేసింది. బుడమేరు వరద వస్తే వరద పారుదల అయ్యే విధంగా కంటి తుడుపు చర్యగా విజయవాడ–నూజివీడు ఆర్అండ్‌బీ రహదారిలో నాలుగు బాక్సు కల్వర్ట్‌ట్ల నిర్మిస్తున్నారు. వాటిలో కండ్రిక వాటర్ ట్యాంక్ ఎదురుగా నిర్మించే కల్వర్టు మాత్రమే శ్లాబు దశ పూర్తికాగా.. మిగిలిన రెండు కల్వర్టులు గోడల నిర్మాణం మాత్రమే జరిగింది. మరొకటి తవ్వకం పనులు కూడా జరగలేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు శాశ్వత నివారణ చర్యలు జరిగేనా అని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్‌లో మళ్లీ వరదలు వచ్చే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..



శివారు ప్రాంతాలను అతలాకుతలం చేసిన బుడమేరు వరద ముంపుకు శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలి.ఆగస్టులో సంభవించిన వరదల్లో నష్టపోయిన ప్రజలు మళ్లీ నష్టపోకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలి.

– బి.నాగిరెడ్డి, పైపులరోడ్డు

భరోసా కల్పించాలి..



బుడమేరు అంటేనే ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం శాశ్వత నివారణ చర్యలు చేపట్టి భరోసా కల్పించాలి.

– కోటేశ్వరరావు, సుందరయ్యనగర్

ఇదీ రోడ్డు తీరు.. ప్రయాణమెలా సారూ!



రోడ్డు మధ్యలో తవ్విన మట్టి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీనగర్ కాలనీ నుంచి అంబేడ్కర్ కాలనీ వరకు జరుగుతున్న యూజీడీ పైపులైన్ పనులు స్థానికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పాతకాలం నాటి పైపులైన్ కావటంతో పాటు పెరిగిన జనాభా, అవసరాల మేరకు నూతన పైపులైన్ పనులు ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ ఇక్కడ పనులు నత్తనడకన జరుగుతుండటంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డును తవ్వి పైపులైన్‌లను వేస్తున్నారు. కానీ తవ్విన మట్టిని మాత్రం పైపులైన్ వేసిన వెంటనే సరిచేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ముత్యాలంపాడు జెండాచెట్టు సెంటర్ నాలుగు రోడ్ల మధ్యలో రోడ్డును తవ్వి పనులు చేపట్టారు. ఇక్కడ పనులు జరుగుతున్నట్లు కానీ.. రోడ్డు డైవర్షన్ చేస్తున్నట్లు కానీ సమాచార బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో ఇక్కడ వరకు వచ్చిన వాహన చోదకులు ఉసూరుమంటూ వెనుకకు తిరిగి వెళుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై వదిలేసిన మట్టి బురదగా మారి ప్రమాదకరంగా మారుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూజీడీ పైపులైన్ పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

ముగిసిన రోబో డ్రోన్ ఫెస్ట్ - 2025



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో ఉత్తమ సాంకేతికను తీర్చిదిద్దేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురునానక్‌నగర్, విజయనగర్ కాలనీలోని డాన్‌బాస్కో ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న రోబో డ్రోన్‌ఫెస్ట్–2025 ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులు రూపొందించిన వర్కింగ్ మోడల్స్‌ను పరిశీలించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన త్రీడి ప్రింటింగ్, రోబో హ్యాండ్, మెడికల్ డిస్పెన్సర్, అంధులకు కళ్లజోడు తదితర ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆలిండియా మనాక్ ఇన్‌స్పైర్ పోటీల్లో గెలుపొందిన లికిత్ కుమార్‌ను బహుమతి అందజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగమ్మ సత్రం కొండపై మల్లిపూడి దుర్గాభవానీ, వీర మహేష్ నెప్రూలు నివాసం ఉంటున్నారు. దుర్గా భవానీకి గతంలో వివాహం కాగా విభేదాల కారణంగా విడాకులు తీసుకుంది. 2014లో వీర మహేష్ నెప్రూను ప్రేమించి రెండో వివాహం చేసుకుంది. ఈ నెల 1వ తేదీన వీర మహేష్ నెప్రూ నల్లజర్లలో ఉంటున్న తన తల్లికి అనారోగ్యంగా ఉందని చెప్పి ఊరు వెళ్లాడు. అప్పటి నుంచి మహేష్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. బుధవారం నల్లజర్లలో ఉంటున్న బంధువులకు ఫోన్ చేయగా, వీర మహేష్ ఊరు రాలేదని చెప్పారు. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ దుర్గాభవానీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప కోటి నామ జప మహాయజ్ఞం



ఊరేగింపు నిర్వహిస్తున్న నిర్వాహకులు, అర్చకులు



హోమంలో పాల్గొన్న ఉభయదాతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం నుంచి అయ్యప్ప కోటి నామ జప మహాయజ్ఞం ప్రారంభమైంది. శ్రీమణికంఠ సేవా సమతి వ్యవస్థాపకుడు బెవర రాము గురుస్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం అయ్యప్ప స్వామి విగ్రహం, కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారి ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు, హోమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలను బెవర రాము పర్యవేక్షించగా, దేవీ లక్ష్మీనారాయణచార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ వైభవంగా జరిపించారు. సాయంత్రం శ్రీలలితా సహస్ర నామ కుంకుమార్చన జరిగాయి. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరలించారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ, భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురుస్వామి బెవర రాము పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం అయ్యప్ప స్వామి పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అనంతరం మహా పూర్ణాహుతితో మహాయజ్ఞం పూర్తవుతుందని చెప్పారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ, మున్సిపాలిటీ కార్మికులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపాలిటీలలో లక్షల మంది కార్మికులు ఆప్కాస్ పరిధిలో పని చేస్తున్నారన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో కూడా దాదాపు 340 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీలో కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాగా మున్సిపాలిటీలో గత కొద్ది కాలంగా రెండు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు ఇవ్వటం లేదని, గతంలో సమ్మె కాలంలో కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ జీతలు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు మధిర ఏడుకొండలు, షేక్ మస్తాన్‌వలి, చొప్పవరపు రత్నకరుణ, బిక్షాలు, డేవిడ్ రాజ్, జ్యోతిమేరి, వెంకటరెడ్డి, సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

శ్రీవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



శ్రీవారి నమూనాలయంలో ఆశీస్సులు తీసుకుంటున్న మల్లాది విష్ణు, చిత్రంలో హనుమాన్ చాలీసా పారాయణ చేయిస్తున్న శ్రీనివాస్

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీవారి నమూనా ఆలయాన్ని రూపొందించి అందులో తిరుమల తరహాలో ఉదయాస్తమాన సేవలు లభించడం అదృష్టంగా భావిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుంటూరు జిల్లా పెనుమాకకు చెందిన శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్రం సేవా సంఘం ఆధ్వర్యంలో భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్‌లో రెండో రోజు బుధవారం నిర్వహించిన శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అర్చకస్వాములు ఆయన్ని ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి ఉదయాస్తమాన సేవలను భక్తులకు అందిస్తున్న నిర్వాహకులు, సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావును ప్రశంసించారు. సాయంత్రం సమయంలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు ఎంఎస్ రామారావు మనుమడు ఎంఎస్ శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహిస్తున్న సుందరకాండ, హనుమాన్ చాలీసా వింటే సమస్త పీడలు, భయాలు తొలగిపోతాయని పేర్కొన్నారు. శ్రీవారి దివ్య ఆశీస్సులు, ప్రసన్నాంజనేయుని చల్లని చూపు నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం



రథాన్ని లాగుతున్న ఆలయకమిటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్‌లోని శ్రీ కోదండ రామమందిరం సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన రథంలో సీతారాములను ఉంచి దేవీనగర్ పురవీధుల మీదుగా ఊరేగించారు. ఊరేగింపులో కాళికా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ కమిటీ సభ్యులు స్వయంగా భక్తులతో కలిసి రథం లాగుతూ రామనామాల నడుమ ఊరేగింపు సాగించారు. దారి పొడవునా మహిళలు, భక్తులు సీతారాములకు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు రాములోరి కల్యాణ విందు..

సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా దేవీనగర్‌లో గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు సీతారాముల కల్యాణ విందు ఏర్పాటు చేసినట్లు ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వీరరాజు, గంగిశెట్టి సాంబశివరావు తెలిపారు. భక్తులు సీతారాములను దర్శించుకుని కల్యాణ విందును స్వీకరించాల్సిందిగా కోరారు.



ఆకట్టుకున్న కాళికా నృత్య ప్రదర్శన

చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో పోరాటాలు



సీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కమ్యూనిస్ట్ ఉద్యమ నేత చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) స్ఫూర్తితో హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో కంట్రోల్ రూం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి రామకృష్ణ బుధవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. సీఆర్ 26 ఏళ్ల పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమానికి బీజం వేసిన తొలి తరం నాయకులు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక వాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఈ దేశంలో ఉన్న ప్రజాస్వామ్యవాదులందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టెల్లాలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



పటమట(విజయవాడతూర్పు): పటమటలోని స్టెల్లా కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులకు బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. నైస్ ఎడ్యుకేషన్ బ్లూ స్టార్, హెచ్‌డీబీ ఫైనాన్స్, ఫాక్ స్కాన్, స్ప్రింగ్ ట్రీ, జీవీసీఈ, టెక్ అవుట్ తదితర సంస్థలు విద్యార్థినులకు కమ్యూనికేషన్, స్కిల్స్, గ్రూప్ డిస్కర్షన్ వంటి అంశాలపై ఇంటర్వ్యూలు నిర్వహించి 150 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇంటర్వ్యూలను కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు లక్ష్మీ హేమ, అనుపమ పర్యవేక్షించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థినిలను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్, అధ్యాపకులు అభినందించారు.

నవరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో చైత్ర మాస వసంత నవరాత్ర సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. ఈ నెల ఎనిమిది నుంచి 16వ తేదీ వరకూ ఆలయంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. అందులో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం మూల మంత్ర హోమాలు, ఔపాసన బలిహరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

ఇంధనం ధరల పెంపుపై నిరసన



ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఇంధనం ధరల పెంపుపై ఇబ్రహీంపట్నంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు మహేష్ మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్, ఇంటి పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూలిగే నక్కపై తాడికాయ పడిన చందంగా గ్యాస్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 పెంచి పేదలపై అధిక భారం మోపిందన్నారు. ఎన్నికల ముందు వరాల జల్లు కురిపించిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక ధరల భారం మోపడం సిగ్గుచేటన్నారు. ఇంధనం ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పట్టణ కమిటీ సభ్యులు ఆలేటి విఠల్‌రావు, కొండలరావు, పార్వతి, బేబీ, రమణమ్మ, లైలా కుమారి పాల్గొన్నారు.